క్లుప్తంగా

మధ్యాహ్న భోజనం సక్రమంగా అందించాలి



ఉపాధ్యాయులు, ఎండీఎం నిర్వాహకులతో మాట్లాడుతున్న డీవైఈవో అప్పారావు

గొలుగొండ: విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ సక్రమంగా ఉండాలని, రోజూ ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని ఉప విద్యాశాఖాధికారి(డీవైఈవో) అప్పారావు సూచించారు. గురువారం ఆయన చోద్యం జిల్లా పరిషత్ హైస్కూల్‌ను సందర్శించారు. ముందుగా పాఠశాల రికార్డులు పరిశీలించారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని ఆదేశించారు. విద్యార్థులకు పాఠ్యాంశాలు అర్థమయ్యేలా బోధించాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన నిర్వాహకులతో మాట్లాడుతూ మెనూ ప్రకారం, నాణ్యతతో పదార్థాలను వండి, వడ్డించాలని సూచించారు. ఆయన వెంట ఎంఈవో సత్యన్నారాయణ, హెచ్‌ఎం రత్నాజీతోపాటు, ఉపాధ్యాయులు ఉన్నారు.

గుల్లేపల్లిలో 'ఫ్యామిలీ డాక్టర్' సేవలు



వైద్య పరీక్షలను నిర్వహిస్తున్న వైద్యాధికారి భారతి

కె.కోటపాడు: ఎపిడమిక్ సీజన్‌లో వైద్య సిబ్బంది సూచించే ఆరోగ్య జాగ్రత్తలను ప్రతి ఒక్కరూ పాటించాలని వైద్యాధికారి భారతి తెలిపారు. గుల్లేపల్లి గ్రామంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా 137 మందికి పలు వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణులకు ఆరోగ్య తనిఖీలు చేసి, సూచనలిచ్చారు. ప్రసవానికి ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేరాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ డీఎస్ఎన్ రాజు, ఎంఎల్‌హెచ్‌పీ పావని, ఏఎన్‌ఎం లక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రోలుగుంట: నర్సీపట్నం డివిజన్ 11 కేవీ సుబ్బారాయుడుపాలెం ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఈఈ డీవీడీ రామకృష్ణారావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ మండలంలోని కుసుర్లపూడి, జేపీ అగ్రహారం, రొంగలపాలెం, జానకిరాంపురం, అప్పనదొరపాలెం, తమరానపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు. వినియోగదారులు విషయం గమనించి సహకరించాల్సిందిగా కోరారు.

అందుబాటులో పశుగ్రాసం విత్తనాలు

నర్సీపట్నం: మండలాల్లోని అన్ని పశు వైద్యశాలలు, రైతు భరోసా కేంద్రాల్లో పశుగ్రాసం విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు నర్సీపట్నం ఏరియా పశు వైద్య సహాయ సంచాలకులు డా.డబ్ల్యు.రాంబాబు తెలిపారు. 900 కిలోల కాకిజొన్న, 600 కిలోల మొక్కజొన్న పశుగ్రాస విత్తనాలు 75 శాతం సబ్సిడీపై విక్రయానికి సిద్ధంగా ఉంచినట్లు పేర్కొన్నారు. మొక్కజొన్న 5 కిలోల విత్తనాల ధర రూ.340 కాగా సబ్సిడీపై రూ.85కు, 5 కిలోల ధర రూ.460 ఉండే కాకిజొన్న విత్తనాలకు రూ.115 చెల్లించి, రైతులు తీసుకెళ్లవచ్చన్నారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కళాశాల ముందు ప్రజాసంఘాల నిరసన

నర్సీపట్నం: విద్యార్థుల సమస్యలపై పోరాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులపై కళాశాల యాజమాన్యం దాడి చేయడాన్ని ఖండిస్తూ శ్రీసాయి కళాశాల వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. సీఐటీయూ, ఐద్వా, భవన నిర్మాణ కార్మిక సంఘం, ముఠా కార్మిక సంఘాల నాయకులు పాల్గొని యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న కళాశాల గుర్తింపును రద్దు చేయాలని, దాడికి పాల్పడిన యాజమాన్యంపై పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు అక్కడకు చేరుకుని విషయం అడిగి తెలుసుకున్నారు. యాజమాన్యంతో మాట్లాడి ఎస్ఎఫ్ఐ నాయకులకు సంజాయిషీ చెప్పించడంతో ఆందోళన ముగిసింది.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
7997958337, 7075709854,
7997958336

తుప్పలు.. వాహన చోదకుల తిప్పలు



తుప్పలతో కె.జె.పురం దబ్బకుంట రహదారి



మాడుగుల ఖండివరం రహదారిలో పరిస్థితి



తుప్పలమయంగా మారిన శంకరం రహదారి

మాడుగుల మండల పరిధిలో రోడ్లు మరియు భవనాల శాఖ, పంచాయతీ రాజ్ శాఖకు చెందిన రోడ్లు నిలువెత్తు తుప్పలు, డొంకలతో దర్శనమిస్తున్నాయి. అడపా దడపా కురుస్తున్న వర్షాలకు ఈ తుప్పలు మరింత ఏపుగా పెరిగాయి. మలుపుల వద్ద సమీపంలోకి వచ్చేంత వరకు ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించలేని దుస్థితి. దీంతో వాహన చోదకులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. తక్షణమే జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలని కోరుతున్నారు.

- రోడ్లకు ఇరువైపులా భారీగా పెరిగిన తుప్పలు
- మలుపుల వద్ద వాహనాలకు తరచూ ప్రమాదాలు
- జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలని స్థానికుల వినతి

మాడుగుల రూరల్: మండలంలోని ప్రధాన రోడ్లకు ఇరువైపులా ఏపుగా పిచ్చి మొక్కలు, తుప్పలు పెరిగిపోయాయి. ప్రధానంగా కె.జె.పురం నుంచి దబ్బకుంట మీదుగా మాడుగుల వెళ్లే రహదారి పరిస్థితి మరీ దారుణం. ఈ రోడ్డుకు ఇరువైపులా డొంకలు, తుప్పలు భారీగా పెరిగిపోయాయి. దీంతో మలుపుల వద్ద ఎదురెదురుగా వస్తున్న వాహనాలు ఢీకొన్న సంఘటనల్లో పలువురు గాయపడ్డారు. ఆర్ అండ్ బీ అధికారులు తక్షణమే స్పందించి ఈ తుప్పల్ని, డొంకల్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

చాలా రోడ్లలో ఇదే పరిస్థితి

- చీడికాడ మండలంలోని పలు గ్రామాల ప్రజలు నియోజకవర్గ కేంద్రానికి చేరుకోవాలంటే కేజే పురం–దబ్బకుంట రోడ్డే ప్రధాన ఆధారం. ఈ రోడ్డులో చాలా నెలలుగా జంగిల్ క్లియరెన్స్ చేపట్టలేదు.
- గాదిరాయి నుంచి వద్దాది పోయే రోడ్డుకు ఇరువైపులా తుప్పలు పేరుకుపోయాయి. సుమారు 9 కిలో మీటర్ల పొడవునా రహదారికి రెండు వైపులా పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి.
- జాలంపల్లి, కింతలి, పోన్నవోలు, ఎ.వీరనారాయణం, ఒమ్మలి, వీజే పురం, గాదిరాయి తదితర పంచాయతీల పరిధిలో ప్రజలు ఈ రహదారి మీదుగానే నిత్యం ప్రయాణాలు సాగిస్తున్నారు. ఇదే రోడ్డుపై ఆర్టీసీ బస్సు కూడా తిరుగుతుంది. పిచ్చి మొక్కలు పెరగడంతో పెద్ద వాహనదార్లు ఇబ్బంది పడుతున్నారు.
- మండలంలోని ఎం.కోడూరు నుంచి వయా మాడుగుల మీదుగా ఖండివరం వెళ్లే రహదారితో పాటు కాశీపురం నుంచి శంకరం, కృష్ణాపురం పోవు రోడ్డులో కూడా ఇరువైపులా ఏపుగా తుప్పలు పెరిగాయి. వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
- కె.జె.పురం నుంచి అప్పలరాజుపురం పోయే రహదారి కూడా తుప్పలతో నిండిపోయింది. వీటిని వెంటనే తొలగించి, వాహనదారులపై వెళ్లేటపుడు తాము పడే ఇక్కట్లను తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.

తుప్పలు తొలగించాలి



రహదారికి ఇరువైపులా ఉన్న తుప్పల్ని వెంటనే తొలగించాలి. వర్షాలకు తుప్పలు, డొంకలు బాగా పెరిగిపోయాయి. ఆర్ అండ్ బీ అధికార్లు జంగిల్ క్లియరెన్స్ చర్యలు చేపట్టాలి. కనీసం ఉపాధి హామీ పథకంలో దీన్ని చేర్చయినా రహదారి వెంబడి తుప్పల్ని తొలగించాలి. ప్రతి రోజు ఈ దారిలో ప్రయాణించే ద్విచక్ర వాహనదార్లు మలుపులు తిరిగే సమయంలో చాలా ఇబ్బందులు పడుతున్నారు.

– జామి రమణబాబు, సర్పంచ్, కేజే పురం, మాడుగుల

నిధులు వచ్చాక తొలగిస్తాం

ఆర్ అండ్ బీ పరిధిలోని రహదార్లకు ఇరువైపులా చాలా చోట్ల పిచ్చిమొక్కలు, తుప్పలు భారీగా పెరిగిపోయాయి. మలుపుల వద్ద వాహనాలు దగ్గరికి వచ్చే వరకు గుర్తించలేక పోతున్నారన్న ఫిర్యాదులున్నాయి. జంగిల్ క్లియరెన్స్ కోసం నిధుల మంజూరు కోరుతూ ప్రతిపాదనలు సిద్ధం చేసి, ఉన్నతాధికారులు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటాం.

– సత్యసాయి శ్రీనివాస్, జేఈ, ఆర్ అండ్ బీ, మాడుగుల సెక్షన్

స్పర్శలేని మచ్చలా.. కుష్టు వ్యాధి కావొచ్చు

- వ్యాధి లక్షణాలపై ఇంటింటా సర్వే



రోలుగుంట: ఇంటింటి సర్వేలో ఆశా వర్కర్లు



గంధవరంలో కుష్టు వ్యాధి సర్వేలో వైద్య సిబ్బంది

చోడవరం రూరల్: ఎవరికైనా తమ శరీరంపై మచ్చలు ఉండి, వాటిపై గట్టిగా గోకినా ఎటువంటి స్పర్శ లేకుంటే కుష్టు వ్యాధిగా గుర్తించాలని మండలంలోని గవరవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ ప్రదీప్, డాక్టర్ సత్యదీపిక తెలిపారు. గురువారం మండలంలోని 20 గ్రామ సచివాలయాల పరిధిలో కుష్టు వ్యాధి గుర్తింపు సర్వే కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. మచ్చలపై ఎలాంటి స్పర్శ లేని వారు ఆరోగ్య సిబ్బంది అందించే వైద్య సహాయాన్ని తప్పక పొందాలని సూచించారు. అశ్రద్ధ చేస్తే ఇబ్బందికర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. 20 సచివాలయాల పరిధిలో 63 మంది ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు 14 రోజులపాటు సర్వే నిర్వహిస్తారన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి వ్యాధి లక్షణాలు గుర్తించిన రోగులకు తక్షణ వైద్యం అందించాలని సిబ్బందికి సూచించారు. సర్వేను ఎంపీహెచ్‌ఈవో రవికుమార్ పర్యవేక్షించారు.

గొలుగొండ: కుష్టు వ్యాధి లక్షణాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలని స్థానిక కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రసాద్ తెలిపారు. పప్పుశెట్టిపాలెంలో ప్రజలకు కుష్టు వ్యాధిపై గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామాల్లో కుష్టు వ్యాధి పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా పసల మారమ్మ పండగ



పండగలో పాల్గొన్న గ్రామస్తులు

కె.కోటపాడు: ఎ.భీమవరం గ్రామస్తులు పసల మారమ్మ పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. ఏటా ఖరీఫ్ సాగు కాలంలో అమ్మవారి పండగను జరపడం గ్రామస్తుల ఆచారం. పండగ సందర్భంగా గ్రామంలోని సతకంపట్టు వద్ద పూజలు జరిపిన భక్తులు వసంతోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం రైతులు ఆ నీటిని పంట పొలాల్లో, పాకలపై చల్లారు. పసలమారమ్మ పండగ చేయడం ద్వారా పశువులకు మంచి ఆరోగ్యంతో పాటు, పంట దిగుబడులు బాగుంటాయని గ్రామస్తులు తెలిపారు.

వైభవంగా మహా రుద్రాభిషేకం



రుద్రహోమంలో పాల్గొన్న భక్తులు

చోడవరం: పండితుల వేద మంత్రాలతో చోడవరం ప్రాంతం మారుమ్రోగింది. లోకకల్యాణార్థం ఉత్తరాంధ్ర ప్రాంత ప్రాచీన శివాలయాల్లో ఒకటైన చోడవరం స్వయంభూ గౌరీశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో మహారుద్రాభిషేకం పూజలు వైభవంగా జరుగుతున్నాయి. రెండో రోజు పూజా కార్యక్రమాల్లో భాగంగా లక్ష్మీగణపతి పూజ, హోమం, రుద్రహోమం, ఛండీహోమం, అరుణ సౌర హోమాలు జరిపారు. సహస్ర లింగార్చన విశేష అభిషేకం నిర్వహించారు. వేదపండితులు సామూహిక వేదమంత్రాల మధ్య మహారుద్రాభిషేకం పూజలు, హోమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కొడమంచిలి చలపతిరావు ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, ప్రముఖ వ్యాపారవేత్త సత్తి సత్యనారాయణరెడ్డి(ధర్మతేజరెడ్డి) పాల్గొని హోమం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఉత్తమ విద్యార్థులకు సత్కారం



అతిథుల చేతుల మీదుగా జ్ఞాపికను అందుకుంటున్న విద్యార్థి

గొలుగొండ: మంచి మార్కులు సాధించిన విద్యార్థులను గుర్తించి, ప్రోత్సహించడం ఆనందంగా ఉందని జిల్లా ఉప విద్యాశాఖాధికారి అప్పారావు తెలిపారు. జోగుంపేట జిల్లా పరిషత్ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు 2024 టెన్త్ ఫలితాల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులను గురువారం ఘనంగా సత్కరించారు. హైస్కూల్లో తాజా ఫలితాల్లో ప్రథమ స్థానంలో నిలిచిన కౌశిక్ చరణ్‌కు రూ.10 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన మౌనికకు రూ.5 వేలు ఆర్థిక ప్రోత్సాహం అందించారు. తెలుగులో ఉత్తమ మార్కులు సాధించిన లక్కోజి దుర్గకు రూ.2 వేలిచ్చారు. 1986–87 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థి అనారోగ్యంగా ఉండటంతో ఆయనకు రూ.10 వేలు ఆర్థిక సాయం అదించారు. ఈ సందర్భంగా డీవైఈవో మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు ఏటా ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం పట్ల అభినందించారు. ఎంఈవో సత్యనారాయణతో పాటు పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు రాయపురెడ్డి చిట్టిబాబు, జి.శ్రీరామమూర్తి, గుడివాడ శ్రీనివాస్, కిరణ్, కె.నానాజీ పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

గొలుగొండ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలు ఎంతగానో నష్టపోతున్నారని, వీటిపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకట రమణ తెలిపారు. ఎర్రవరం సమీపంలోని రాజులుబాబు గుడి వద్ద గురువారం సీపీఐ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేద ప్రజల గురించి ఆలోచించకుండా, పెత్తందార్లను పెంచి పోషిస్తున్నాయని ఆరోపించారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో తీవ్రంగా విఫలం చెందారని ఆక్షేపించారు. పెద్ద పెద్ద కంపెనీలు పెత్తందార్ల చేతుల్లో పెట్టడంతో, దేశ భవిష్యత్తు నాశనమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ ముఖ్య నాయకులు మాకిరెడ్డి రామునాయుడు, జిగురు బాబు, శివలంక కొండలరావు, మేకా భాస్కరరావు, జి.రాధాకృష్ణతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత



మొక్క నాటుతున్న ఫారెస్ట్ అధికారి నూకరాజు

కె.కోటపాడు: పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా గుర్తించాలని అనకాపల్లి సోషల్ ఫారెస్ట్రీ డిప్యూటీ రేంజ్ అధికారి ఎ.నూకరాజు అన్నారు. కొత్త అగ్రహారం ప్రాథమిక పాఠశాలలో గురువారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ అమ్మ పేరున ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటాలని పిలుపునిచ్చారు. నాటిన మొక్కల సంరక్షణ బాధ్యతను కూడా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వెలగల పైడంనాయుడు, సెక్షన్ అధికారి పి.శివకుమార్, వన సేవకుడు చిరికి గోవింద, ప్రధానోపాధ్యాయుడు రాజా పంతుల సురేష్, అంగన్‌వాడీ కార్యకర్త ఎల్.వెంకటలక్ష్మి, గనివాడ దేముడుబాబు, యడ్ల రామ్మూర్తి, వై.ముత్యాలనాయుడు, లెక్కల కన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

11 మందికి కు.ని. ఆపరేషన్లు

రోలుగుంట: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి కె.ధనలక్ష్మి ఆధ్వర్యంలో పలువురు బాలింతలకు గురువారం కుటుంబ నియంత్రణ(కు.ని.) ఆపరేషన్లు నిర్వహించారు. రావికమతం, రోలుగుంట మండలాల్లోని పలు గ్రామాల నుంచి వచ్చిన 11 మంది మహిళలకు కోటవురట్ల నుంచి వచ్చిన గైనకాలజిస్ట్ అనీష కు.ని. శస్త్ర చికిత్సలు చేశారు. అనంతరం వారి ఆరోగ్య గురించి తెలుసుకుని పలు సూచనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు.

షెడ్యూల్ ప్రకారం గ్రామ సభలు నిర్వహించాలి

దేవరాపల్లి: షెడ్యూల్ ప్రకారం గ్రామ సభలను పారదర్శకంగా నిర్వహించాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ కోరారు. ఈ మేరకు ఎంపీడీవో కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీవో ఎస్.అప్పలరాజును గురువారం కలిసి వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ సభల పట్ల నిర్లక్ష్యం వహించకుండా వారం రోజుల ముందే షెడ్యూల్ విడుదల చేసి, ప్రజలకు దండోరా ద్వారా తెలియజేయాలన్నారు. గ్రామ సభలకు గైర్హాజరయ్యే అధికారులపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో ఐక్యవేదిక జిల్లా ఉపాధ్యక్షుడు కొరుప్రోలు శ్రీను, మండల ప్రతినిధులు చొక్కాకుల రమణ, గొర్లి తాతారావు, గంగవంశం సంతోష్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత

నర్సీపట్నం: వాతావరణంలో మార్పుల కారణంగా వ్యాప్తి చెందే సీజనల్ వ్యాధుల నియంత్రణకు వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి, ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ సుర్ల రాజేశ్వరి సూచించారు. గురువారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉండటం వల్లే వ్యాధులు ప్రబలుతున్నాయన్నారు. వైస్ ఎంపీపీలు కూండ్రపు తాతబాబు, ఇన్నం రత్నం, జెడ్పీటీసీ సుకల రమణమ్మ, ఎంపీడీవో జాన్ లింకన్, రమణబాబు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణపై అవగాహన



ర్యాలీలో విద్యార్థులు, న్యాయవాదులు

చోడవరం రూరల్: హెల్మెట్ ధరించండి.. హ్యాపీగా ప్రయాణించండి, రోడ్డు ప్రమాదాల బారిన పడకండి.. కుటుంబాలను రోడ్డున పడేయకండి అంటూ గురువారం చోడవరం న్యాయవాదులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం మూడు యూనిట్ల విద్యార్థులు వాహనదారులకు అవగాహన కలిగించారు. హెల్మెట్ వాడకాన్ని ప్రోత్సహిస్తూ రాష్ట్రీయ న్యాయ విజ్ఞాన పరిషత్ ఆదేశాల మేరకు పట్టణ వీధుల్లో న్యాయవాదులు, విద్యార్థులతో కలసి ప్రదర్శన నిర్వహించారు. చోడవరం బార్ అసోసియేషన్, ఎన్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ప్రదర్శనలో విద్యార్థుల ర్యాలీని ప్రిన్సిపాల్ టి.రాధాకృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ప్రారంభించగా, కోర్టుల సముదాయం వద్ద న్యాయవాదులు, పోలీసులు కలిసి కొత్తూరు జంక్షన్ నాలుగు రోడ్ల కూడలికి చేరుకున్నారు. అక్కడ మానవ హారంగా ఏర్పడి హెల్మెట్ ధారణ వల్ల కలిగే ప్రయోజనాలను, రోడ్డు ప్రమాదాలతో కుటుంబాలకు వాటిల్లే ముప్పును వివరిస్తూ నినాదాలు చేశారు. ర్యాలీలో హెల్మెట్లను చేతబూనారు. ఈ సమయంలో హెల్మెట్ ధరించిన వాహన చోదకులకు స్వీట్లు పంచిపెట్టి ప్రోత్సహించారు. సబ్ ఇన్‌స్పెక్టర్ వి.శేఖరం, చోడవరం బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కాండ్రేగుల డేవిడ్, గొర్లె కృష్ణవేణి, లోక్ అదాలత్ కమిటీ న్యాయవాది భూపతి రాజు, సీనియర్ న్యాయవాదులు, ఎన్ఎస్ఎస్ మూడు యూనిట్ల పీవోలు బి.పిచ్చమ్మ, వి.రత్నభారతి, డి.మాల్యాద్రి, సీనియర్ ఉపన్యాసకులు పాల్గొన్నారు.

విషయ పరిజ్ఞానంతో ఉత్తమ ఫలితాలు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మోహన్‌రావు

మాకవరపాలెం: విషయ పరిజ్ఞానంతో అత్యుత్తమ ఫలితాలను సాధించవచ్చని అవంతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌రావు అన్నారు. స్థానిక కళాశాలలో గురువారం విద్యార్థులకు హై పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్(హెచ్‌పీసీ)పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సాంకేతికతపై విషయ పరిజ్ఞానం పెంపొందించుకోవడం ద్వారా బోధనలో అధ్యాపకులు, పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తారన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన హైదరాబాద్ సీబీఐటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ కంప్యూటర్, క్లౌడ్ కంప్యూటింగ్‌పై క్షుణ్ణంగా వివరించారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు వేగవంతం చేయాలి



సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీవో చంద్రరావు

మాకవరపాలెం: ఉపాధి పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో చంద్రరావు సిబ్బందికి సూచించారు. మండలంలో 2024–25 ఏడాదికి సంబంధించి మంజూరైన పనుల ప్రగతిపై గురువారం సిబ్బందితో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాదికి మండలానికి మంజూరైన నిధులు, పూర్తి చేసిన పనుల వివరాలను తెలుసుకున్నారు. పనులను సకాలంలో పూర్తి చేయాలని, 100 రోజుల పని దినాలు కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీవో వరలక్ష్మి, టెక్నికల్ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కనుల పండువగా జగన్నాథుని మారు రథయాత్ర



తిరుగు రథయాత్రలో స్వామివారి ఉత్సవమూర్తులు

చోడవరం: జగన్నాథస్వామి వారి మారు రథయాత్ర గురువారం వైభవంగా సాగింది. ఒక పక్క జోరున వర్షం కురుస్తున్నా రథయాత్ర ఆగలేదు. తొలి రథయాత్ర అనంతరం స్థానిక బోళ్లవీధి రామాలయం ఆవరణలో పది రోజులపాటు స్వామివారిని దశావతార రూపాల్లో అలంకరించి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. తిరుగు రథయాత్రోత్సవాన్ని దేవదాయశాఖ ఈవో సత్యనారాయణమూర్తి ప్రారంభించారు. ఆలయం వద్ద ప్రారంభమైన ఈ రథయాత్ర పెదబజార్, కోఆపరేటివ్‌కాలనీ, మెయిన్‌రోడ్డు, పీఎస్‌పేట రోడ్డు, శివాలయం, ఆర్టీసీ కాంప్లెక్స్, కొత్తూరు జంక్షన్ మీదుగా ప్రాచీన దేవాలయమైన శ్రీ కేశవస్వామి ఆలయ ప్రాంగణంలోని ఉపాలయంలో వేంచేసియున్న జగన్నాథుడి ఆలయం వరకు కన్నుల పండువగా సాగింది. ప్రత్యేకంగా అలంకరించిన రథంపై సుభద్ర, బలభద్రుడు, జగన్నాథుడి ఉత్సవమూర్తులను ఉంచి ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ అర్చకులు రామకృష్ణాచార్యులు, సీతారామాచార్యులు హారతులిచ్చి ప్రత్యేక పూజలు జరిపారు. యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో వచ్చి స్వామివారి రథం లాగుతూ గోవింద నామస్మరణ చేశారు.

మద్యం షాపు భవన వివాదంపై విచారణ

దేవరాపల్లి: తన కుమారుడి పేరిట కొనుగోలు చేసిన స్థలంలో నిర్మించుకున్న భవనంపై వివాదానికి తావులేదని, గత ప్రభుత్వంలో దాన్ని ప్రభుత్వ మద్యం షాపునకు అద్దెకిచ్చాను తప్ప, ఆ నిర్మాణానికి ప్రభుత్వం నుంచి ఎలాంటి బిల్లులు మంజూరు కాలేదని భవన యజమాని, కొరువాడ వీఆర్వో పోతల శంకరరావు తెలిపారు. మండలంలోని ఎం.అలమండలో అంగన్‌వాడీ కేంద్రం కోసం నిర్మించిన భవనంలో ప్రభుత్వ మద్యం షాపు నిర్వహిస్తున్నారన్న ఫిర్యాదుపై అధికారులు గురువారం బహిరంగ విచారణ చేపట్టారు. స్థానిక గ్రామ సచివాలయంలో ఈవోపీఆర్డీ జి.సంతోషి నళిని చేపట్టిన విచారణకు గ్రామ సర్పంచ్ దాడి జగన్, ఫిర్యాదుదారు గొర్లె గోవింద, మాజీ జెడ్పీటీసీ పోతల పాత్రునాయుడు, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, మండల ఇంజినీర్ కె.ఉమామహేశ్వరరావు, స్థానిక వీఆర్వో పవన్, సచివాలయ సిబ్బందితోపాటు శంకరరావు హాజరయ్యారు. వీరి నుంచి విచారణాధికారి స్టేట్‌మెంట్లు తీసుకున్నారు. పంచాయతీ రికార్డులు తనిఖీ చేసిన అనంతరం అంగన్‌వాడీ కోసం నిర్మించిన భవనాన్ని పరిశీలించారు. సంతోషి నళిని మాట్లాడుతూ గ్రామానికి చెందిన గొర్లి గోవింద డీపీవోకు గత నెల 26న ఇచ్చిన ఫిర్యాదుపై డీపీవో ఆదేశాల మేరకు విచారణ చేపట్టామన్నారు. నివేదికను డీపీవోకు అందిస్తామన్నారు. అనంతరం పోతల శంకరరావు మాట్లాడుతూ ఈ స్థలంలో గతంలో అంగన్‌వాడీ భవనం నిర్మించేందుకు ప్రయత్నించగా తాము అడ్డుకోవడంతో, వేరే చోట దాన్ని నిర్మించిన విషయాన్ని తెలిపారు. ఈ భవనాన్ని తమ సొంత నిధులతో నిర్మించుకున్నామని, దీనికి ప్రభుత్వం నుంచి ఎలాంటి బిల్లులు మంజూరు కాలేదని స్పష్టం చేశారు.

వర్షాలతో వరినాట్లు ప్రారంభం



ఒమ్మలి ప్రాంతంలో జరుగుతున్న వరినాట్లు

మాడుగుల రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గురువారం ఉదయం నుంచి కురుస్తున్న వర్షం వరి నారుమడులకు ఎంతో ఉపయోగకరంగా మారింది. గత కొన్ని రోజులుగా అడపా దడపా కురుస్తున్న వర్షాలకు రోడ్లు చిత్తడిగా మారాయి. పల్లపు భూముల్లో నీరు చేరి, వరి నాట్లు ప్రారంభమయ్యాయి. ఒమ్మలి, వీజే పురం, సత్యవరం, పొన్నవోలు, తాటిపర్తి, కింతలి తదితర గ్రామాల్లో వరి నాట్లు వేయడంలో రైతులు తలమునకలయ్యారు. మెట్ట భూముల్లో రైతులు సరుగుడు, టేకు నారు వేస్తున్నారు. తాజా వర్షాలకు తాచేరు, శారదానదులలో నీరు చేరింది.

'క్లోరినేషన్‌పై నిర్లక్ష్యం వద్దు'

నాతవరం: తాగునీటి పథకాల్లో క్లోరినేషన్ ప్రక్రియపై నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని ఎంపీడీవో జాగరపు రాంబాబు హెచ్చరించారు. మండలంలోని మర్రిపాలెం, వెన్నలపాలెం గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. తాగునీటి పథకాల్లో క్లోరినేషన్ ఏ విధంగా చేస్తున్నారో స్వయంగా ట్యాంకు పైకెక్కి పరిశీలించారు. వైద్య సిబ్బంది ఇంటింటా చేస్తున్న సర్వే వివరాలను పరిశీలించి జ్వరాలు, డయేరియా వ్యాపించకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి చిన్నారులు, గర్భిణులు, బాలింతల వివరాలను ఆరా తీశారు. మర్రిపాలెం సచివాలయాన్ని తనిఖీ చేసి సిబ్బందితో సమావేశమయ్యారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నర్సీపట్నం డివిజన్:
నర్సీపట్నం : 9010234557
చోడవరం : 9010210265
మాడుగుల : 9010546644
Office mail : sakshiadvtvsp@gmail.com